
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 29.564 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 2,423 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.58,570
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,277
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,435
సవర (8 గ్రా) -	రూ.43,480

గరిష్టం/కనిష్టం
39.0 /27.6

వాతావరణం

శనివారం గాలిలో తేమ 58 శాతం ఉంది. ఆదివారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

దేశ సేవకు ఆర్మీలో చేరండి



మాట్లాడుతున్న మేజర్ శ్వేతా ఉపాధ్యాయ

ముత్తుకూరు: దేశ సేవ చేసేందుకు విద్యార్థులు, యువకులు ఆర్మీలో చేరాలని మేజర్ శ్వేతా ఉపాధ్యాయ పిలుపునిచ్చారు. కృష్ణపట్నం, ముత్తుకూరు, ఈపూరు, వెంకన్నపాళెం విద్యార్థులు 800 మందికి శనివారం అదానీ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో ఆర్మీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత నావికా దళంలో ఉద్యోగావకాశాల గురించి వివరించారు. ఆర్మీలో చేరేందుకు అర్హతలు, అందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుతం ఉన్న అవకాశాలను విశదీకరించారు. ఇందుకోసం విద్యార్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో కల్నల్ గంగాసతీష్, అరుణ్, రాహుల్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.వినయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ షిరిడీషా హోండా, బాలాజీ టెలీవెంచర్స్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్‌వర్క్, సేల్స్, సర్వీస్ మేనేజర్స్, బిల్లింగ్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్, ఆఫీస్ బాయ్, డ్రైవర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరు నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

అందుబాటులో ఇంటర్ సర్టిఫికెట్లు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షలు, మేలో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఆర్‌ఐఓ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆదివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత విద్యార్థుల తగిన ఆధార పత్రాలతో వచ్చి సర్టిఫికెట్లు తీసుకొని విద్యార్థులకు వెంటనే అందజేయాలని తెలిపారు.

రూ.10 పెట్టు.. బ్యాగు పట్టు



క్లాత్ బ్యాగ్‌లు వచ్చే ఏటీఎం మెషీన్

నెల్లూరు(సెంట్రల్): పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తూ క్లాత్ బ్యాగ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. నెల్లూరులోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కార్యాలయ ఆవరణలో కాలుష్య నియంత్రణ మండలి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎనీ టైమ్ బ్యాగ్ (ఏటీఎం) మెషీన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో రూ.10 నోటు పెడితే క్లాత్ బ్యాగ్ వస్తుంది. బ్యాంక్ ఏటీఎం లాగా ఏర్పాటు చేయడంతో వినియోగదారులు ఈ మెషీన్‌ను వినియోగించుకుంటున్నారు.

ఓయ్..గరమ్ చాయ్



నెల్లూరువాసులు ఆహార ప్రియులు.. కొత్త రుచులను స్వాగతించడంలో వీరికి సాటి లేరు. నిద్ర లేచింది మొదలు రాత్రి భోజనం పూర్తి చేసిన తరువాత కూడా టీ తాగందే నిద్రపోని వ్యక్తులు ఉన్నారు. స్నేహితులతో ముచ్చట్లు పెట్టాలన్నా.. తోటి ఉద్యోగులతో పిచ్చాపాటి మాట్లాడాలన్నా.. వ్యాపారులు తమ లావాదేవీలపై.. నాయకులు రాజకీయాలపై చర్చించాలన్నా చాయ్ కేఫ్‌లు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. అలాగే మహా నగరాలకే పరిమితమైన ఇరానీ చాయ్ కేఫ్‌లు ఇప్పుడు నెల్లూరు వాసులను తమ రుచితో ఆకర్షిస్తున్నాయి.

- నగరవాసులకు అందుబాటులోకి ఇరానీ చాయ్
- జిల్లావ్యాప్తంగా వెలసిన కొత్త కేఫ్‌లు
- రుచికరమైన టీ అందిస్తూ కస్టమర్లను ఆకర్షిస్తున్న నిర్వాహకులు
- వినియోగదారులతో చాయ్ సెంటర్లు బిజీబిజీ

సండే స్పెషల్

నెల్లూరు సిటీ: ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అనే తేడా లేకుండా చాయ్ సెంటర్లు నిత్యం కిటకిటలాడుతుంటాయి. ప్రతి ప్రాంతంలో కనీసం రెండు నుంచి మూడు కేఫ్‌లు ఉంటున్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేల చాయ్ సెంటర్‌లు, కేఫ్‌లు ఉంటాయని అంచనా. మహా నగరాల్లో ఉండే వివిధ రకాల చాయ్ సెంటర్లు ప్రస్తుతం నెల్లూరులో వెలుస్తున్నాయి. ఆయా కంపెనీల ఫ్రాంచైజీలను నగరవాసులు కొంత మొత్తం చెల్లించి నెల్లూరులో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మహా నగరాలకు మాత్రమే పరిమితమైన ఇరానీ చాయ్ ఇప్పుడు నెల్లూరు వాసులను తన రుచితో కట్టిపడేస్తోంది. అయితే కొందరు టీ తాగితే కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తాయంటుంటారు. అలాంటి వారి కోసం లెమన్ టీ, బ్లూ టీ, గ్రీన్ టీ, బాదం టీ లాంటి వాటిని కూడా కేఫ్ నిర్వాహకులు అందిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు.. ఇలా చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ గరమ్ చాయ్‌ని ఇష్టపడుతూ చాయ్ కేఫ్‌లను ఆదరిస్తున్నారు.

క్వాలిటీలో తగ్గేదేలే..

నెల్లూరు వాసులు రుచికి, క్వాలిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. రుచి బాగుంటే అమితంగా ఆదరిస్తారు. దీంతో ఆ వ్యాపారం సైతం అంతే స్థాయిలో అభివృద్ధి చెందుతుంది. అయితే రుచిలో, నాణ్యతలో ఎలాంటి తేడా జరిగినా నగరవాసులు అటువైపు కూడా చూడరు. ఇలాంటి పరిస్థితులు చాలా మంది వ్యాపారులు ఎదుర్కొన్నారు కూడా. గ్రాండ్‌గా సెలబ్రిటీలతో ప్రారంభించినా, ఆఫర్లు ఇచ్చినా, పెద్దగా పట్టించుకోరు. కేవలం రుచికి, నాణ్యతకే ప్రాధాన్యం ఇస్తారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు సైతం షుగర్ లెస్ ఇరానీ చాయ్ సైతం పలు చాయ్ కేఫ్‌లలో అందుబాటులో ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



కస్టమర్‌కు టీ రెడీ చేస్తూ..

పోటాపోటీగా..

గతంలో నెల్లూరు నగరంలోని ప్రధాన సెంటర్లలో మాత్రమే టీ కేఫ్‌లు ఉండేవి. జనాభా పెరుగుదలతోపాటు ప్రజలు టీ, కాఫీలకు బాగా అలవాటు పడడంతో చాయ్ సెంటర్లకు ఆదరణ పెరిగిందని చెప్పవచ్చు. కొందరు చాయ్ సెంటర్ల నిర్వాహకులు పోటాపోటీగా ఇతర రాష్ట్రాల్లో మాత్రమే అందుబాటులో ఉండే చాయ్ రుచులను సైతం నెల్లూరు వాసులకు పరిచయం చేస్తున్నారు. నగరంలోని రామలింగాపురం, అన్నమయ్య సర్కిల్, మాగుంటలేఅవుట్, వీఆర్సీ సెంటర్, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, వేదాయపాళెం, మూలాపేట, సంతపేట, కేవీఆర్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో కొత్త రుచులతో టీ కేఫ్‌లు, ఇరానీ చాయ్ సెంటర్లు నూతనంగా వెలిశాయి. అయితే వాటిలో కొన్ని కేఫ్‌లు మాత్రమే రుచితో, నాణ్యతతో చాయ్ అందిస్తున్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

సరదాగా కాసేపు..

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతుంటారు. ఈ క్రమంలో మైండ్‌ను ఫ్రెష్ చేసుకునేందుకు సహచర ఉద్యోగులతో కలిసి ఓ టీ తాగుదామని చాయ్ కేఫ్‌లకు వస్తున్నారు. అలాగే స్నేహితులు వివిధ రకాల వృత్తుల్లో ఉన్నప్పటికీ సాయంత్రం అయిందంటే చాయ్ సెంటర్ల వద్ద క్యూ కడుతున్నారు. స్నేహితులతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ చాయ్‌ని సిప్ చేస్తూ తమ టెన్షన్‌లను తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక్కో వ్యక్తి ఒక్కో రకమైన టీని ఆస్వాదిస్తుంటారు. ఈ క్రమంలో చాయ్ సెంటర్ల నిర్వాహకులు కొత్త రుచులను పరిచయం చేస్తూ కస్టమర్లను ఆకర్షిస్తున్నారు.

ఎన్ని టెన్షన్లు ఉన్నా ఒక్క టీ చాలు



నేను ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. నాకు ఎన్ని టెన్షన్లు ఉన్నా వెంటనే చాయ్ సెంటర్‌కు వెళ్లి ఒక్క చాయ్ తాగితే చాలు మనసు ప్రశాంతంగా ఉంటుంది. రోజుకు కనీసం నాలుగు టీలు తాగుతాను. ధమ్ టీ, ఇరానీ చాయ్ నాకు చాలా ఇష్టం.

– భాను, రామలింగాపురం

స్నేహితులతో కలిసి..



రోజూ చిల్డ్రన్స్ పార్క్‌లో వాకింగ్‌కు వస్తుంటాను. వాకింగ్ పూర్తయ్యాక స్నేహితులతో కలిసి చాయ్ సెంటర్‌కు చేరుకుంటాం. రుచికరమైన చాయ్‌ని ఆస్వాదిస్తూ మాట్లాడుకుంటాం. స్నేహితులతో అలా కూర్చొని చాయ్ తాగుతూ మాట్లాడుతుంటే చాలా హ్యాపీగా ఉంటుంది.

– రాము, చిల్డ్రన్స్ పార్క్ సెంటర్

చాయ్ ప్రత్యేకత

ఇరానీ చాయ్ ప్రస్తుతం నెల్లూరువాసుల అభిమానాన్ని కూడా సంపాదించుకుంది. దీని ప్రత్యేకత ఏంటంటే ఒకసారి ఇరానీ చాయ్ తాగితే మళ్లీమళ్లీ అదే చాయ్ తాగాలనిపిస్తుంది. వినియోగదారులు వెతుక్కుని మరీ ఇరానీ చాయ్ సెంటర్‌లకు వెళుతుంటారు. ఇరానీ చాయ్ తయారీకి అవసరమైన ఆకులను అసోం నుంచి తెప్పిస్తుంటారు. వీటి ధర తక్కువలో ఒక కేజీ ప్యాకెట్ రూ.250 నుంచి రూ.300 వరకు ఉంటుంది. క్వాలిటీ కలిగినవి రూ.400 నుంచి రూ.425 వరకు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే బ్లాక్ టీ కొందరు అమితంగా ఇష్టపడుతుంటారు. అసోం నుంచి తెప్పించే ఈ టీ పొడి కేజీ ప్యాకెట్ రూ.1200 ఉంటుందని, ఇది బ్లడ్‌లో కొలెస్ట్రాల్ తగ్గిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. అదేవిధంగా ఆరోగ్యం కోసం గ్రీన్‌టీ (కేజీ ప్యాకెట్ రూ.1000), లెమన్ టీ, బాదం టీలను సైతం వినియోగదారులు ఇష్టపడుతున్నారు. కొన్ని చాయ్ సెంటర్లు హాట్ బాదమ్ మిల్క్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. చాయ్ కనీసం రూ.15 నుంచి ఆపై ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓలు కీలకం



హాజరైన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)లది కీలకపాత్ర అని, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలకు సంబంధించిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓలకు నిర్వహించిన స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 వర్క్‌షాపులో కలెక్టర్ పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు నూతనంగా నియమితులైనందున వారికి ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి వర్క్‌షాపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం గౌరవంగా భావించాలన్నారు. ఎన్నికల విధినిర్వహణలో పాల్గొనే ప్రతి ఉద్యోగి భారత ఎన్నికల సంఘం పరిధిలో ఉంటారనే విషయం గమనించాలని, ఈ ప్రక్రియలో జరిగే చిన్న తప్పులు కూడా పెద్ద సమస్యలకు దారి తీస్తాయని, అందుకే ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. స్వచ్ఛంగా తయారైన ఓటరు జాబితా బీఎల్‌ఓల పనితీరుకు అద్దంపడుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ప్రతి సమస్యకు ఎన్నికల సంఘం నిబంధనల్లో పరిష్కారముందని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై తీవ్ర క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఈ వర్క్‌షాపులో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు, ఆరోగ్యం – స్త్రీశిశు సంక్షేమం – ప్రభుత్వ పథకాలు, బాల్య వివాహాల నిరోధక చర్యలు, పాఠశాల విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, హౌసింగ్, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో అమలు, మనబడి నాడు– నేడు తదితర అంశాలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో భాగంగా 10–19 వయస్సు గల పిల్లలకు, 15–49 వయస్సు గల గర్భిణులకు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయాలని తెలిపారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు, అదనపు పౌష్టికాహారం తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం విజయవంతంగా అమలయ్యేలా కలెక్టర్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యాశాఖకి సంబంధించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో నూటికి నూరు శాతం సాధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాల్యవివాహాలను అరికట్టాలని, నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ ఎం.హరినారాయణన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, హౌసింగ్ పీడీ నాగరాజు, సీపీఓ రాజు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ..

- రూ.3.26 కోట్ల నగదు తీసుకుని విద్యుత్ ఉద్యోగి అదృశ్యం
- ఎస్‌ఈని కలిసిన బాధితులు



పరారైన కార్తీక్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి తమ వద్ద పెద్ద మొత్తంలో నగదు తీసుకుని కనిపించడం లేదని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్‌ను శనివారం కలిశారు. బాధితుల కథనం మేరకు నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కార్తీక్ తన ఉద్యోగంతోపాటు విద్యుత్‌శాఖకు సంబంధించిన అధికారులకు తన వాహనాలను(కార్లను) కాంట్రాక్ట్ పద్ధతిలో అద్దెకు ఇవ్వడంతోపాటు చీటీలు వేసేవాడు. ఈ క్రమంలో కార్తీక్ తాను కాంట్రాక్ట్ పనులు చేస్తున్నానని, గెస్ట్‌హౌస్‌లు నిర్మించేందుకు నగదు అవసరమని తన తోటి సిబ్బందితోపాటు పలువురి వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. ఈ క్రమంలో గత నెల 3వ తేదీ నుంచి కార్తీక్ ఆచూకీ తెలియకపోవడంతో శనివారం పలువురు బాధితులు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్‌ను కలిసి తమకు కార్తీక్ నుంచి రావాల్సిన రూ.3.26 కోట్ల నగదును ఇప్పించే ఏర్పాట్లు చేయాలని విన్నవించుకున్నారు. అయితే ఈ సమస్యను పోలీసులు, కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని, కార్తీక్ గత నెల 3వ తేదీ నుంచి నెల రోజులపాటు సెలవు పెట్టాడని, ఈ నెల 4వ తేదీ విధుల్లో చేరాల్సి ఉండగా ఇప్పటికీ చేరలేదని ఎస్‌ఈ బాధితులకు తెలిపారు. దీంతో బాధితులు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కావలి: పట్టణంలోని పాతూరు అక్కమ్మబావిలో గుమ్మడి శ్రీకాంత్ (23) అనే యువకుడి మృతదేహం అనుమానాస్పద స్థితిలో వెలుగుచూసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు పాతూరులోని మద్దూరివారివీధికి చెందిన గుమ్మడి శ్రీకాంత్ తల్లిదండ్రులు మృతిచెందడంతో మేనత్త వద్ద ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. తరచూ తాగే అలవాటు ఉన్న శ్రీకాంత్ రెండు రోజుల క్రితం పూటుగా మద్యం తాగి అక్కమ్మబావి వద్ద ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నం



కాకాణి రమణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి తదితరులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వంలో మంత్రిగా రాజీలేని పోరాటం చేసి ప్రజల పక్షాన నిలబడతానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ముందుగా పొదలకూరు పట్టణంలోని తన తండ్రి కాకాణి రమణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో రూ.2 కోట్లతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే ఏసీ కాలనీ, మనుబోలురోడ్డు సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తరగతి గదుల మరమ్మతులు తదితర పనులు రూ.2.88 కోట్లతో పూర్తి కావడంతో వాటిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పట్టణంలో మిగిలిపోయిన కొద్దిపాటి సీసీ రోడ్లకు రూ.40 లక్షలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఒక్క పొదలకూరు పంచాయతీలోనే సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల పనులు రూ.26 కోట్లతో పూర్తిచేశామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని వారు అడ్డుకునేందుకు శాయశక్తుల ప్రయత్నించి విఫలమయ్యారని తెలిపారు. తాను ప్రతిపక్ష ఎమ్మెల్యేగా డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు ప్రయత్నిస్తే టీడీపీ ప్రభుత్వంలో ఉన్న సోమిరెడ్డి అడ్డుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలేజీలో సీఎస్ఆర్ నిధులు వెచ్చించి చక్కగా మరమ్మతులు చేపట్టిన సియెల్ ఎనర్జీ కంపెనీ ప్రతినిధులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. రూ.139 కోట్లతో సర్వేపల్లి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్, పూర్వ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ సురేఖ, తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీ నగేష్‌కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీలు వి.చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపండి



జిల్లా స్థాయి నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల క్రీడాకారులతో ఎంపీపీ తదితరులు

- ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి
- ఉత్సాహంగా నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

ఆత్మకూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గాలకు చెందిన అండర్-14, 17 విద్యార్థినీ, విద్యార్థులకు నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, ఎంపికలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎస్‌జీఎఫ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలలతో పాటు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. హెచ్‌ఎం అనంతలక్ష్మి, పీడీ తిరుపతయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్‌తో కలిసి క్రీడా పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. బాల్‌బ్యాడ్మింటన్, నెట్‌బాల్ పోటీల్లో 40 జట్లు పాల్గొనగా, రాష్ట్రస్థాయికి 4 జట్లు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. పీఈటీలు సురేష్, జమునారాణి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ

గుంటూరు ఈస్ట్: రాష్ట్రంలోని అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోందని దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. గుంటూరులోని కొత్తపేటలో ఉన్న దేవదాయశాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అర్చకుల సమస్యలపై అధికారులతో కలిసి కమిషనర్ సత్యనారాయణ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనువంశిక అర్చకుల పరిరక్షణే ధ్యేయంగా వారి పేర్లు నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,539 మంది అర్చకులను గుర్తించామన్నారు. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాల్లో ఫౌండర్ ట్రస్టీ లేక అనువంశిక అర్చకులకు ఆలయ నిర్వహణను అప్పగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జోన్ పరిధిలో 39 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ధూప దీప నైవేద్యం కింద 4,700 దేవాలయాలకు రూ.5 వేల చొప్పున ఇస్తున్నామన్నారు. కనీస వేతనం రూ.3,205 మందికి ఇస్తున్నట్లు తెలిపారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నవరం, కాణిపాకం తదితర దేవాలయాల తరపున ధర్మ ప్రచార రథాలను నిర్వహిస్తున్నామన్నారు. సింహాచలం, విజయవాడ, శ్రీశైలం తదితర పెద్ద దేవాలయాల్లో ధర్మ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 6ఏ పరిధిలోని దేవాలయాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, రైతు భరోసా కింద అర్చకుల పేర్ల నమోదుకు కలెక్టర్లతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పలువురు అర్చక సమాఖ్య నాయకులు, అర్చకులు తమ సమస్యలను కమిషనర్‌కు వివరించగా సంబంధిత అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్నేహితుడి కారుతో వ్యక్తి పరార్

- చెన్నై వద్ద పట్టుకున్న పోలీసులు

వెంకటాచలం: నగదు తెచ్చుకునేందుకు కారు కావాలని స్నేహితుడిని నమ్మబలికి కారుతో పరారైన వ్యక్తి పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన వెంకటాచలం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు ఆత్మకూరులోని జేఆర్ పేటకు చెందిన గోపి శుక్రవారం ఆత్మకూరుకు చెందిన మొబైల్ వెటర్నరీ వాహనం డ్రైవర్ షేక్ సుభాన్ వద్దకు వెళ్లి రూ.10 వేలు అప్పు ఇవ్వాలని అడిగాడు. తన వద్ద నగదు లేదని చెప్పడంతో, చెన్నైలో ఆస్పత్రిలో ఉన్న తన తల్లి వద్ద నగదు ఉందని, బాడుగ కారు మాట్లాడాలని సుభాన్‌ను గోపి కోరాడు. దీంతో సుభాన్ తన మరో స్నేహితుడు దేవరాజ్ కారులో వెళ్లేలా మాట్లాడగా, అందులో సుభాన్, గోపి, మరో ఇద్దరు స్నేహితులు షఫీ, నవీన్ చెన్నైకు బయలుదేరారు. మార్గమధ్యంలో వెంకటాచలం మండలం కాకుటూరు సమీపంలో భోజనం కోసం ఆగారు. అందరూ కారు దిగి భోజనం చేస్తుండగా, వాటర్ బాటిల్ కారులో ఉందని చెప్పి కారు వద్దకు వెళ్లిన గోపి ఎంతసేపటికీ స్నేహితుల వద్దకు రాలేదు. అనుమానం వచ్చి సుభాన్ అతని స్నేహితులు వెళ్లి చూడగా, కారు అక్కడ లేకపోవడంతో వెంటనే గోపికి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. దీంతో సుభాన్ డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ అంకమరావు వెంటనే కేసు నమోదు చేశారు. కారుతో పరారైన గోపీని పట్టుకునేందుకు బూదనం, సూళ్లూరుపేట, టోల్‌గేట్ల వద్ద సిబ్బందిని అలెర్ట్ చేశారు. చివరకు శనివారం తెల్లవారుజామున చెన్నై సమీపంలో కారును, నిందితుడు గోపిని అదుపులోకి తీసుకున్నారు.

ఖైదీ మృతిపై 12న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): నెల్లూరు సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న రాయపాటి నాగరాజు మృతిపై ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నట్లు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలానికి చెందిన రాయపాటి నాగరాజు అనే వ్యక్తిని చికిత్స కోసం ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన విశాఖలో కేజీహెచ్‌కు తరలించారు. అదే నెల 21వ తేదీన సాయంత్రం 6.45 చికిత్స పొందుతూ చనిపోయాడని ఆర్డీఓ తెలిపారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నిర్ణయించారు. విచారణ అధికారిగా విశాఖ ఆర్డీఓను నియమించారు. విశాఖ ఆర్డీఓ కార్యాలయంలో 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నామని, నాగరాజు మృతిపై తెలిసిన వారు ఎవరైనా విచారణకు హాజరై, లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆర్డీఓ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌కు చెందిన వివాహిత కన్యధార చంద్రకళ (28) శనివారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. చంద్రకళ, పిచ్చయ్య దంపతులు. పిచ్చయ్య దుత్తలూరు సెంటర్‌లో సెలూన్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే మధ్యాహ్న సమయంలో పిచ్చయ్య ఇంటికెళ్లి భోజనం చేసి తిరిగి దుకాణానికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో చంద్రకళ విషద్రావణం తాగి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గుర్తించిన ఆమె కుమారుడు తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. అతను హుటాహుటిన ఇంటికి చేరుకొని 108 వాహనంలో ఆమెను చికిత్సనిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి చంద్రకళ మృతిచెందినట్లు నిర్ధారించారు. చంద్రకళకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


పెట్రోల్ దాడి నిందితుడికి రిమాండ్

మనుబోలు: మండల పరిధిలోని వీరంపల్లి సమీపంలో నాలుగు రోజుల క్రితం సునంద అనే మహిళపై పెట్రోల్‌తో దాడి చేసిన ఘటనలో నిందితుడు పుట్టయ్యకు శనివారం రిమాండ్ విధించినట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. సునంద భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పుట్టయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా సునందతో స్నేహంగా ఉన్న పుట్టయ్య గతంలో ఓసారి ఆమెపై బలాత్కారానికి యత్నించాడని, ఈ విషయంపై తాము మందలించడంతో ఆమెపై కక్ష పెంచుకుని పథకం ప్రకారం వెంబడించి పెట్రోల్ పోసి నిప్పంటించాడని ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ మంగళంపాడు గ్రామంలో శనివారం ఓ వ్యక్తి(45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళంపాడు గ్రామానికి చెందిన గంటా వెంకటరమణయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య భాగ్యమ్మ ఆమె కుమార్తె ఇద్దరూ బ్యాంకులో పనినిమిత్తం వెంకటాచలానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకోగా వెంకటరమణయ్య ఇంట్లో ఉరేసుకుని మృతిచెందడంతో బోరున విలపించారు. వెంకటరమణయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. వెంకటరమణయ్యకు భార్య భాగ్యమ్మతో పాటు కుమార్తె, కొడుకు ఉన్నారు. ఈ విషయంపై వెంకటాచలం పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.55
సన్నవి : రూ.25
పండ్లు : రూ.5

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.138
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.238
స్కిన్‌లెస్ చికెన్:	రూ.264
లేయర్ చికెన్:	రూ.200